# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## కన్నుల పండువగా

# స్వర్ణరథోత్సవం

ఆగమోక్తంగా
స్నపన తిరుమంజనం



చంద్రగిరి, మే 11 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణవెంకటేశ్వర స్వామివారి వార్షిక వసంతోత్సవాలలో స్వామివారు స్వర్ణరథంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి స్వామివారిని వసంత మంపడపానికి వేంచేపుచేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనం, తేనె, కొబ్బరినీళ్ళతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై స్వర్ణరథంపై అధిష్టించి తిరుమాడ వీధులల విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏవిఎస్ఓ. సురేంద్రబాబు, ఈఈ 2 ప్రసాద్, డిఈఈ దామోదరం, ఏఈఓ గురుమూర్తి, ఆర్కియాలజీ సిఏ ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్స్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనంబట్ట ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, శేషాచార్యులు, జమేధర్ మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## గజవాహనంపై ఊరేగిన శ్రీ పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, మే 11, ప్రభాతవార్త



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గజ వాహనంపై తిరుమాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాఢ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ కృష్ణ స్వామి ముఖ్య మండపంలో అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఉంజల్ సేవ నిర్వహించారు. అనం తరం విశేషాలంకరణలో విరాజిల్లుతున్న అమ్మవారు గజవాహనంపై తిరు వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్స్పెక్టర్ సుభాస్కార్, ప్రసాద్, అశోక్, ఏవిఎస్వో శైలేంద్ర బాబు, విఐ రామ్మోహన్, ఆగమసలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు చేరిన విద్యాకానుక కిట్లు

**- పరిశీలించిన కలెక్టర్ సగిలి షన్మోహన్**



చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:

2023-24 విద్యాసంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం రోజున ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే విద్యాకానుక కిట్లు జిల్లాకు వచ్చి చేరాయి. జిల్లాకు వచ్చి చేరిన విద్యాకానుక కిట్లను కలెక్టర్ సగిలి షన్మోహన్ గురువారం తనిఖీ చేశారు. జిల్లాకు వచ్చిన విద్యాకానుక కిట్లను చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విద్యాశాఖ భద్రపరిచింది. ఈ కేంద్రంను అకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించడానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాకానుక కిట్లను పకడ్బందీగా పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డివైఇఓ చంద్రశేఖర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ సెల్వరాజ్, ఇతర మండల అధికారులు వున్నారు.

## శివయ్య ఆదాయం రూ.2.32కోట్లు

శ్రీకాళహస్తి, మే 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల హుండీలతో పాటు పరివారదేవతల హుండీల లెక్కింపును నిర్వహించారు. మొత్తం రూ.2,32,19,079 కోట్లు వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు, ఇఓ కెవి సాగర్‌బాబులు తెలిపారు. ఇందులో బంగారు 000.129.200, వెండి 842.500కిలోలు, విదేశీనోట్లు 119 వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం 43 రోజులకు వచ్చినట్లు తెలిపారు.

# గంగమ్మకు సాంప్రదాయబద్ధంగా సారె

### రెండవ రోజు సారెను సమర్పించిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత దంపతులు



తిరుపతి కార్పొరేటర్, మే 11, ప్రభాతవార్త

తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర రెండవ రోజు గురువారం గంగమ్మకు సాంప్రదాయబద్ధంగా సారెను సమర్పించిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, అనిల్ కుమార్ దంపతులు, సారె సమర్పణ కార్యక్రమంలో కమిషనర్ స్వగృహం నుండి హరిత, అనిల్ కుమార్ దంపతులు, వారి కుటుంబ సభ్యులతో బాటు తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, అధ్యాంతం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి లీలామహల్ సర్కిల్ వద్ద కమిషనర్ ఇంటి నుండి భారీ ఊరేగింపుగా మేళా తాళాలు, మంగళవాయిద్యాలు, విచిత్ర వేషదారుణలు నడుమ సారేను గంగమ్మకు మున్సిపల్ కమీషనర్ హరిత దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ జాతరలో ప్రతి ఒక్కరూ అత్యంత భక్త శ్రద్ధలతో పాల్గొంటున్నారన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ కుటుంబ సమేతంగా సంప్రదాయంగా గంగమ్మ జాతరలో సారె సమర్పించడం తమ అదృష్టమని, ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచార సంప్రదాయం కొనసాగిస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో పుట్టినప్పటి నుండి ప్రతి సంవత్సరం గంగమ్మకు వేషాలు వేస్తూ, జాతర జరుపుకుంటున్నామని, ఈ సంవత్సరం తిరుపతి జాతరలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్‌గా పాల్గొనడం అమ్మవారి కృపేనన్నారు. తిరుపతి నగర ప్రజలు అందరూ సంతోషంగా గంగమ్మ జాతరలో పాల్గొంటున్నారని కమిషనర్ హరిత తెలిపారు.

## చంద్రబాబు చేసేది గోరంత

# ఎల్లో మీడియా ప్రచారం కొండంత

**రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



సదుం, మే 11 ప్రభాతవార్త

రాష్ట్రానికి చంద్రబాబునాయుడు గోరంత చేస్తే పచ్చ, ఎల్లో మీడియాలు కొండంతగా రాస్తారనీ, అదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి పనులు చేస్తుంటే గోరంతగా ప్రచారం చేస్తారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానికంగా కన్వీనర్లు, గృహసారథుల అవగాహన సమదస్సుకు మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని రెండుకళ్ళుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన జరుగుతోందన్నారు. తేదేపాకు చెందిన పచ్చ, ఎల్లో మీడియాలు కావాలనే ప్రభుత్వంపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రజలకు సంక్షేమ ఫలాలందాలంటే జన్మభూమి కమిటీలు నిర్ణయించాలనీ, అయితే జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదరికమే కొలమానంగా అందరికీ అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దేశంలోనే గర్వించతగ్గ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చరిత్రకెక్కారన్నారు. తన రాజకీయ అనుభవంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోనూ మెడికల్ కాలేజీలు, నాడునేడు ద్వారా పాఠశాలలకు మహర్ధశ తీసుకొచ్చామన్నారు. పుంగనూరుతోపాటు మరో 3నియోజకవర్గాల్లో ఇంటింటికీ మంచినీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో గడచిన 4యేళ్ళల్లో 40యేళ్ళ అభివృద్ధిని చేసి చూపించామన్నారు. సమస్యలే లేని సమాజం కోసం వైకాపా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్ళి జరిగిన లబ్ధిని వివరించాలనీ, టిడిపి కార్యకర్తల ఇళ్ళకు సైతం వెళ్ళి మనం చేసిన అభివృద్ధిని తెలపాలన్నారు. అందరి కృషితో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తంబళ్ళపల్లి, చిత్తూరు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, అరణి శ్రీనివాసులు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఎంపిపి ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, సిహెచ్‌సి ఛేర్మన్ కృష్ణారెడ్డి, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైకాపా నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమర్ధవంతంగా పౌష్టికాహార పంపిణీ

**స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్**



చంద్రగిరి, మే 11 ప్రభాతవార్త:

భావితరాల బాలబాలికల సంపూర్ణ ఆరోగ్యానికై పౌష్టిహాకారాన్ని సమర్ధవంతంగా పంపిణీ చేయాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్ అన్నారు. చంద్రగిరి మండల పరిధిలోని రెడ్డివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని, రాయలపురం పంచాయతీ, వెంకటంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి మౌళిక వసతులు, పిల్లలకు విద్యాబోధనలు, గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై అదికారులను అడిగితెలుసుకున్నారు. ఈ క్రమంలో పిల్లలకు తయారు చేసిన వంటలను, భోజనాన్ని ఆమె పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజ, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి, పులికంటి రెడ్డి ప్రదీప, సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.2.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

**ఎలాంటి బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు - డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వెల్లడి**



దొరవారిసత్రం, మే 11 ప్రభాతవార్త

ఎలాంటి బిల్లులు, డాక్యుమెంట్లు లేకుండా తీసుకెళుతున్న రెండున్నర కోట్ల రూపాయల విలువైన ఐదు కేజీల బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతన్న రెండు కార్లను వాహన తనిఖీలలో భాగంగా దొరవారిసత్రం పోలీసులు తనిఖీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలలో ఎలాంటి బిల్లులు లేకుండా కార్లలో తీసుకెళుతున్న 5 కిలోల 201 గ్రాముల బంగారాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ బంగారం బిస్కెట్ల విలువ సుమారు రెండున్నర కోట్ల రూపాయల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ బంగారాన్ని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బంగారు బిస్కెట్లను కస్టమ్స్ అధికారులకు అప్పగిస్తామని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. వాహనాలను తనిఖీలలో పాల్గొన్న నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్య, సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి, దొరవారిసత్రం పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## శుద్ధ తిరుమల సుందర తిరుమలకు

# పలువురు ప్రముఖులు

**-25 సెక్టార్లుగా ఘాట్‌రోడ్లు, నడకమార్గాలు శుభ్రత**



తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:

శుద్ధ తిరుమల సుందర తిరుమల రేపు(శనివారం)చేపట్టనున్న టిటిడి కార్యక్రమానికి పలువురు ప్రముఖులు స్వచ్ఛందంగా కదలివస్తున్నారని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. రెండు ఘాట్‌రోడ్లు, నడకమార్గాలను25సెక్టార్లుగావిభజించి పూర్తిగా నిరుపయోగంగా ఉన్న, ఏళ్ళతరబడి పేరుకుపోయిన ప్లాస్టిక్‌వ్యర్థాలు తొలగించనున్నట్లు తెలిపారు. రేపు ఉదయం "సామూహిక శ్రమదానం" లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడమే లక్ష్యమన్నారు. మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ, రాష్ట్రస్వచ్ఛ ఆంధ్రకార్పొరేషన్ సలహాదారుడు డాక్టర్ జయప్రకాశ్ సాయి, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, టిటిడి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది,పోలీసు,జిల్లా కలెక్టర్ కార్యాలయం యంత్రాంగం,న్యాయశాఖ అధికారులు తిరుమల మీడియా స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

## యువకుడిపై హత్యాయత్నం



తిరుపతి క్రైం, మే 11, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో యువకుడిని కత్తితో పొడిచి హత్యాయత్నం చేశారు. ఎంఆర్ పల్లి సిఐ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభాస్ అనే యువకుడు బుధవారం నాయుడుపేట హైవేలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు తిరుపతి హతిరంజి కాలనీ బైరెగపట్టడలో చేపట్టారు. అంత్యక్రియలో స్నేహితులందరూ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌టివి నగర్‌కు చెందిన కొందరు యువకులు మద్యం మత్తులో గొడవపడ్డారు. ప్రసాద్ అనే యువకుడిని ఫైరజ్ ఉమా గౌరీ మార్బుల్‌తో కొట్టి తలకు బలమైన గాయం చేసారు. తన స్నేహితుని ఎందుకు కొట్టారని విజ్ఞాన వర్మ ప్రశ్నించాడు. దీంతో ఆ ముగ్గురు యువకులు విజ్ఞాన్ వర్మని కత్తితో పొడిచి హత్య చేయడానికి ప్రయత్నించారు. కత్తి పోట్లుతో ఉన్న స్నేహితుడిని మరికొందరు హాస్పిటల్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## కుప్పంలో ప్రవేశించిన జంట ఏనుగులు..

కుప్పంరూరల్, మే 11 ప్రభాతవార్త

కుప్పం మండలంలో మరలా గజరాజుల హల్‌చల్ మొదలైంది. తమిళనాడు కృష్ణగిరి జిల్లాలో ఓ రైతును హతమార్చిన రెండు ఏనుగుల గుంపును తమిళ అటవీ అధికారులు ఆంధ్రవైపు దారి మళ్లించారు. దీంతో ఈ ఏనుగులు కుప్పం మండలంలోని ప్రవేశించాయి. మండలంలోని కూసూరు, మోట్లచేను, పైపాళ్యం సమీప అటవీ ప్రాంతాల్లో ఈ ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఏనుగుల దారి మళ్లింపుకు ట్రాకర్లు రంగంలో దిగారు. అటవీ పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థుల ఈత సరదా..ఓ విద్యార్థి గల్లంతు



గంగకాలువలో గల్లంతైన విద్యార్థి(ఫైల్‌ఫోటో)

తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త

వేసవి కాలంలో విద్యార్థుల ఈతసరదా గంగ కాలువలో పొయ్య పంచాయతీ గురుకులపాళెం ఓవిద్యార్థి గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పెద్దసింగమాల గ్రామానికి ఆనుకుని తెలుగుగంగ కాలువ ఉంది. కాలువ బ్రిడ్జి వద్దకు గురుకులపాళెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఈతకు వెళ్ళారు. వారిలో గురుకులపాళెం గ్రామానికి చెందిన కట్టాశ్రీరాములు, సక్కమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒకుమారుడు. కుమారుడు రూపేష్(15) పెద్దకన్నలి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. రూపేష్‌కు ఈతరాకపోవడంతో మెట్లపై కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి గంగకాలువలోపడి గల్లంతయ్యాడు. ఒకే కుమారుడు కావడంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడును తెలుగుగంగ కాలువలో పడిగల్లంతవ్వడంతో అమ్మనాన్నల వేదన వర్ణనాతీతం. చుట్టుపక్కల గ్రామస్తులు ప్రజలు గల్లంతైనా రూపేష్‌ను బయటకు తీయడానికి కాలువలో దిగి గాలిస్తూన్నారు. విషయం తెలుసుకున్న వైకాపా మండల సీనియర్ నాయకులు వాసుదేవనాయుడు ఉన్నతాధికారులతో మాట్లాడి కాలువలో వస్తున్న నీటి ప్రవాహాన్ని తగ్గించడానికి ప్రయత్నించడంతో పాటు గల్లంతైన రూపేష్ కోసం గాలిస్తున్నారు. సమాచారం అందుకున్న టుటౌన్ సిఐ మల్లిఖార్జున తమ సిబ్బందితో కాలువ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే కాలువలో నీటిప్రవాహం ఎక్కువగా ఉండడంతో సిబ్బందిని అక్కడే ఉంచి ఎప్పటికప్పుడు సమీక్షించారు. చీకటి పడడంతో గ్రామస్తులు కాలువ వద్దనే నిరీక్షించాల్సి వచ్చింది. విషయాన్ని గ్రామస్తులు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్ళారు. రాత్రి వరకు మండల వైకాపా నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు కాలువ వద్దనే నిరీక్షించి గ్రామస్తులతో చర్చించారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కంకణం

- కలెక్టర్ సగిలి షన్మోహన్

**చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:**
చిత్తూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకొని ముందడుగు వేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. ప్రతి కళాశాల యాజమాన్యం వారి కళాశాలలో మాదకద్రవ్యాలు వాడటం లేదని తప్పనిసరిగా డిక్లరేషన్ ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు కోసం నిర్వహించే సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆర్ఐఓ, పోలీసు, అగ్నిమాపక శాఖ, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపాల్టీ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడానికి జిల్లాలోని



ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు కళాశాలలకు సంబంధించి 2023-24 సంవత్సరపు అనుమతి కొనసాగింపుకు తప్పనిసరిగా వారి కళాశాలల్లో మాదకద్రవ్యాలు వాడటం లేదని డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. అలాగే ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు కోసం ఏర్పాటైన త్రిసభ్య కమిటీ, సంబంధిత శాఖల అధికారులు వారి పరిధిలో వారు పరిశీలించాల్సిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందించాలన్నారు. అలాగే ఇంటర్మీడియేట్ బోర్డు నిబంధనల ప్రకారం ఫైర్ సర్టిఫికేట్, తరగతి గదుల కొలతలు, టాయిలెట్స్, ఆటస్థలం, ల్యాబరేటరి, డ్రగ్స్ అబ్యూస్ సర్టిఫికేట్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను వీలైనంత త్వరగా కమిటీకు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్ఐఓ రమేష్, చిత్తూరు డివిఈఓ దయమందరాజు, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, లెక్చరర్స్ హేమలత, సుమంత్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వినోదం, విజ్ఞానంతో వేసవి శిక్షణా శిబిరం

**చిత్తూరురూరల్, మే 11 ప్రభాతవార్త:**



పిల్లల అభిరుచులకు అనుగుణంగా వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తూ తల్లిదండ్రుల మన్ననలు, ప్రశంసలను వేసవి శిక్షణా శిబిరం అందుకొంటున్నదని చిత్తూరు ఉపవిద్యాశాఖాదికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తపోవనం పాఠశాల నందు జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంను ఉపవిద్యాశాఖాదికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞాన విందులందించేందుకు పలు చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే జిల్లా బాలభవన్ చిన్నారుల సృజనకు పదునుపెట్టేందుకు శిక్షణ అందిస్తున్నదన్నారు. చిత్రలేఖనం, రంగులు వేయడం, పేపరు కటింగ్ తదితర వాటిపై విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదనీ, ఈ అద్భుతమైన వేసవి శిక్షణా శిబిరంను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు తమ సృజనాత్మకతతో చిత్రించిన చిత్రలేఖనం, పేపరు కటింగ్ తదితర చిత్రాలను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలభవన్ పర్యవేక్షకులు, చిత్రలేఖన శిక్షకులు కె.రామచంద్రారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలను అరికట్టాలని డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి

**వెదురుకుప్పం, మే 11 ప్రభాతవార్త :**



భూ ఆక్రమణలను అరికట్టాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం జగనసేన పార్టీ ఇన్‌చార్జీ పొన్న యుగంధర్ డిప్యూటీ తహశీల్దార్ కోమలికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుండి నియోజకవర్గం పరిధిలో భూ ఆక్రమణలు పెరిగిపోయాయని ఆరోపించారు. మండలంలోని గొడుగుచింత పంచాయితీ పరిధిలోని తార్లబయలు రెవెన్యూ పరిధిలో అధికంగా భూ అక్రమణలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సెంటు భూమిలేని పేదలకు భవిష్యత్తులో భూమి ఇవ్వాలన్న లభ్యమైయే పరిస్థితి లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలు అరికట్టలని డిమాండ్ చేశారు. రెవెన్యూ చట్టం ప్రకారం ఆక్రమణలకు పాల్పడ్డవారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తార్లబయలు రెవెన్యూ క్షేత్ర పరిశీలన చేసిఆక్రమణలను అరికట్టి ప్రభుత్వ భూములు కాపాడాలని డిమాండ్ చేశారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

**గంగవరం, మే 11, ప్రభాతవార్త :**
కౌండిన్య నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గంగవరంకు చెందిన చిన్న శ్రీనివాసులు అనే వ్యక్తి మేలుమాయి క్రాస్ సమీపంలో గల కౌండిన్య నది నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అందిన సమాచారం మేరకు చిన్న శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## ఎర్రపల్లి రోడ్డు పనులకు భూమి సర్వే

**చౌడేపల్లి, మే 11 ప్రభాతవార్త**



మండలంలోని శెట్టిపేట-ఎర్రపల్లి మధ్య రోడ్డు పనులకు అధికారులు చర్యలు తీసుకొన్నారు. గతంలో ఈ మార్గంలో బండిబాట పోరంబోకు ఉండేదనీ, అయితే రైతులు ఆక్రమించి సాగుకు పూనుకోవడంతో దారి లేకుండా పోయింది. దీంతో బ్యాంకు రెడ్డెప్ప ఎర్రపల్లి గ్రామస్తులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన తహశీల్దార్ మాధవరాజు రోడ్డు సర్వే పనులకు చర్యలు తీసుకొన్నారు. పంటకాలం పూర్తయిన తర్వాత రైతులు స్వచ్ఛందంగా రోడ్డుకు స్థలం ఇవ్వాలని అధికారులు రైతులకు సూచించారు.

## అవినీతి నిర్మూలించడానికి యాప్

- ఎస్ఐ సురేష్



**పాలసముద్రం, మే 11 ప్రభాతవార్త:**
ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసిందని ప్రతి ఒక్కరు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగకుండా చూడాలని ఎస్ఐ సురేష్ పిలుపునిచ్చారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేష్ గురువారం ఎసిబి 14400 యాప్ వినియోగంను పోలీసులతోనే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడైనా లంచం అడిగితే ప్రజలు 14400 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వాయిస్, వీడియోలను ఎసిబికి సెండ్ చేయవచ్చునన్నారు. గుగూల్ ప్లేస్టోర్‌లో 14400 యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం రూపొందించిన పోస్టర్ వుంటుందన్నారు. ఎఎస్ఐ మురుగేష్, చక్రవర్తి, జానకిరామన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మైనార్టీలకు వైకాపా ప్రభుత్వం మొండిచేయి

- తెదేపా రాష్ట్ర నేత ఖాదర్ బాషా



**కుప్పం, మే 11 ప్రభాతవార్త**
వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలోని మైనార్టీలకు మొండిచేయి చూపుతోందని కుప్పం తెదేపా పరిశీలకుడు, రాష్ట్ర నేత గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం కుప్పంలో తెదేపా మైనార్టీ విభాగం అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు వెళ్లేవారికై 8.50లక్షల విమాన చార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. గతంలో తెదేపా పాలనలో మైనార్టీలకు కార్పోరేషన్ రుణాలు, దుకాన్ మకాన్ తదితర పథకాలు అమలు చేస్తే వాటిని వైకాపా ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. మైనార్టీలకు కార్పోరేషన్ ఏర్పాటుచేసి ఒక్కరూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. మైనార్టీలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనన్నారు. కార్యక్రమంలో నేతలు సర్దార్, అన్సర్, జాకీర్, గనిఉల్లా, వజీర్, నబీ ఉల్లా, మునాఫ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐలో చేరికకు దరఖాస్తులు

**శాంతిపురం, మే 11 ప్రభాతవార్త**
శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నగేష్ కోరారు. ఏడాది కాలం మెకానిక్ డీజిల్, వెల్డర్, రెండు సంవత్సరాల డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ కోర్సులకు ఆసక్తిగల వారు జూన్ 6వతేది లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9618918534, 9704624408నెంబరును సంప్రదించాలని కోరారు.

## రాజకీయాలకు అతతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు



**ఐరాల, మే 11 ప్రభాతవార్త:**
సీఎం జగన్ రాజకీయాలకు అతీతంగా నవరత్నాలు కార్యక్రమం ద్వారా అర్హులందరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. గురువారం మండలంలోని పొలకల-1 గ్రామ సచివాలయ పరిధిలోని తాళంబేడువారిపల్లె, నరసింహాపురం, ఎగువ రెడ్డివారిపల్లె, బీసీ కాలనీ, దిగువ రెడ్డివారిపల్లె బీసీ కాలనీ, రెడ్డివారిపల్లె, రెడ్డివారిపల్లె ఎస్సీ కాలనీ తదితర గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమను నిర వ్హించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పేద ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఈపథకాలు అర్హులైన పేదలందరికి అందుతున్నాయా? లేదా? అని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, మండల స్థాయి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

**ఐరాల, మే 11 ప్రభాతవార్త:**
సీఎం జగన్ రాజకీయాలకు అతీతంగా నవరత్నాలు కార్యక్రమం ద్వారా అర్హులందరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. గురువారం మండలంలోని పొలకల-1 గ్రామ సచివాలయ పరిధిలోని తాళంబేడువారిపల్లె, నరసింహాపురం, ఎగువ రెడ్డివారిపల్లె, బీసీ కాలనీ, దిగువ రెడ్డివారిపల్లె బీసీ కాలనీ, రెడ్డివారిపల్లె, రెడ్డివారిపల్లె ఎస్సీ కాలనీ తదితర గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమను నిర వ్హించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, మండల స్థాయి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించేదాకా సమ్మె విరమించేది లేదు



**కుప్పం, మే 11 ప్రభాతవార్త**
వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించేదాకా సమ్మె విరమించేది లేదని ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు స్పష్టం చేశారు. తాత్కాలిక ఉద్యోగులు చేస్తున్న సమ్మె 14వ రోజు కొనసాగింది. నల్లటి దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల వేతనాలతో పాటు 12 నెలల అరియర్లు, సిఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సూళ్లూరుపేట అభివృద్ధికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**సూళ్లూరుపేట, మే 11 ప్రభాతవార్త**
సూళ్లూరుపేట పట్టణాన్ని అధునాతనమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్కువీధి, బాపూజీ వీధి సచివాలయాల పరిధిలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించడం జరిగిందని, ఇప్పటికే ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బాపూజీ వీధి రోడ్డును తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన ఈ ప్రాంత ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చాలన్న లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను పంచి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, అలవల సురేష్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## రామమందిరంకు స్దలం కేటాయింపు

- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి



**వెంకటగిరి మే 11 ప్రభాతవార్త**
పట్టణంలోని 7 వార్డు కోళ్లపారం వద్ద రామమందిరం నిర్మిణ విషయమై రెండు వర్గాల వారితో చర్చించి రెండు స్దలం కేటాయించినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కు మార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గూడూరు ఆర్‌డిఓ కిరణ్‌కుమార్, డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతూ సరే ్వనంబర్ 137 లో 35 సెంట్ల భూమి ఉందని ఇందులో ఓవర్‌హెడ్ ట్యాంకు, అంగన్ వాడి భవనంకు, స్కూలు భవనంకు స్దలం కేటాయించి మిగిలిన రెంగు సెంట్ల స్దలాన్ని రాముల వారిగుడికి కేటాయించినట్లు తెలిపారు. మొదట స్దానికుల అవసరాలకు స్దలం కేటాయించి తర్వాత రాముల వారిగుడికి స్దలం కేటాచించినట్లు తెలిపారు. మూత పడి ఉన్న ఆర్ఓ ప్లాంటును అందుబాటు లోకి తీసుకొని వచ్చి మినరల్‌వాటర్ ఇస్తామన్నారు. స్దానికులు కోరిన విదంగ స్దలం కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో తాసిల్దార్ పద్మావతి, కమీషనర్ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం

- గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్



**కోట, మే 11 ప్రభాతవార్త**
కోటలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకుంటామని గూ దూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం కోటలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో శిథిలావస్థకు చేరు కున్న భవనాలను అధికారులు తొలగించారు. ఆ స్థలాలను పాత ఆసుపత్రి, పాత మండల పరిషత్ కార్యాలయ స్థలాలను ఆయన పరిశీలించారు. అక్కడ రోడ్డుకు ముందున్న చిరు వ్యాపారులు షాపులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రావెల్ తోలించి ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే బాగుంటుందని అన్నారు. అటు పంచాయతీకి ఆర్థిక వనరులు చేకూరడమే కాకుండా చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం అక్కడ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపిడిఓ భవాని, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## కారు బోల్తా

- పలువురికి గాయాలు

**కోట, మే 11 ప్రభాతవార్త**
కోట మండలం కేశవరం గ్రామ సమీపంలో జిడి రోడ్డుపై గురువారం ఓ కారు బోల్తాపడిన ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోట ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట, మే 11 ప్రభాతవార్త**
క్రీడలతో మానసిక ఉల్లాసమే కాకుండా శారీరక దృఢత్వం కూడా ఏర్పడుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలోని ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ ఇండియన్ స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయుడుపేట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు భావన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాయుడుపేటలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సౌత్ ఇండియన్ స్థాయిలో ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందంగా



ఉందన్నారు. ఇక్కడకు వచ్చిన క్రీడాకారులందరూ మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించే వైపు దూసుకెళ్లాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో సరదాగా కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ ఛైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కలికి మాధవరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, తహశీల్దార్ మాగార్ల రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కపోత.. దోమల మోత

**కోట, మే 11 ప్రభాతవార్త**
ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం 7 గంటల వరకు వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రతతో జనం ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టేందుకు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు జనం ఏసీలు, ఎయిర్ కూలర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల గత రెండురోజుల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు అనధికారికంగా కోత విధిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజనీర్లకు సైతం ఎలాంటి సమాచారం అందడం లేదు. దీంతో ఫోన్ చేసినా వినియోగదారులకు సరైన సమాధానం ఉండటం లేదు. రాత్రి వేళ విద్యుత్ సరఫరాలో కోత విధిస్తుండటంతో పల్లె వాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బయటకొస్తే దోమల బెడద, ఇంట్లో ఉంటే ఉక్కపోతతో రాత్రి వేళ జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్నపిల్లలు ఉన్న వారు విలవిల్లాడుతున్నారు.

## మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

**కోట, మే 11 ప్రభాతవార్త**
కోట మండలం విద్యానగర్‌కు చెందిన సుధాకర్ తన భార్య బుధవారం రాత్రి నుంచి కనిపించడం లేదని గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్య వాకింగ్‌కు అని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళ అదృశ్యంపై పోలీసులు విచారిస్తున్నారు.

## తెలుగుదేశం పార్టీ పాదయాత్ర విజయవంతం చేయాలి

ఏరియా యూనిట్ ఇన్చార్జి అబ్దుల్ రహీం
బూత్ కన్వీనర్లు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, మహిళ నేతలు కార్యకర్తలతో సమావేశం

**గూడూరు, మే 11, ప్రభాతవార్త**




ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం గూడూరు 2వ పట్టణం 30వ వార్డులో జరిగే మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఇంటింటికి తెలుగుదేశం పార్టీ పాదయాత్ర విజయవంతం చేసేందుకు ఏరియా యూనిట్ ఇంచార్జి అబ్దుల్ రహిం ఆధ్వర్యంలో యూనిట్ పరిధిలోని బూత్ కన్వీనర్లు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి బిల్లు చెంచురామయ్య, యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు పరమేశ్వర గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ సరస్వతమ్మ, పర్వీన్, సరస్వతమ్మ, ధనలక్ష్మి, హరిబాబు, లక్ష్మణరావు, షణ్ముగం, అశోక్ నాయుడు, శంకర్ నాయుడు, కేశవల్ నాయుడు, ఫయాజ్ అయ్యాజ్, చాన్ భాషా, రమేష్ కుమార్, చంద్రమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ చేయూత కార్యక్రమం ద్వారా నిరుపేదలకి పలసరుకుల పంపిణీ

**గూడూరు, మే 11, ప్రభాతవార్త**
గూడూరు పట్టణంలోని స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో నిరుపేదలకు గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ చేయూత అనే కార్యక్రమం ద్వారా పలసరుకులు గురువారం పంపిణీ చేపట్టారు. ఈ సందర్బంగా రోటరీ గూడూరు వెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ బండి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ పేదలకు అండగా అనేక కార్యక్రమాలు మా రోటలో క్లబ్ తరపున ఇప్పటికే చేపట్టామని, ఇక ముందు కూడా పేదలు సౌకర్యార్థం చేపడతామని, అదే విధంగా నేడు చేపట్టిన రోటరీ చేయూత కార్యక్రమం ద్వారా 16 మంది నిరుపేదలకు పలసరుకులు పంపిణీ చేశామని, పలసరుకులు పంపిణీకి దాతగ కందాటి తులసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కందాటి సుకుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని, ఈ రోటరీ చేయూత కార్యక్రమం గత మూడు సంవత్సరాల నుండి ప్రతి నెల చేపడుతూ ఉన్నామని, ఇకముందు కూడా కొనసాగుతుందని తెలియజేసారు. ఫాస్ట్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి మాట్లాడుతూ తల్లి జ్ఞాపకార్థం ఏదైనా సామాజిక సేవ చేయాలని ఉద్దేశంతో వారి కుమారుడు సుకుమార్ రెడ్డి దాతగా వ్యవహరించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ ధనుంజయ రెడ్డి, రాజారెడ్డి, సేగు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, తాళ్లూరు శ్రీనివాసులు, బలరాం రెడ్డి, సుధాకర్, వాసు గౌడ్ పాల్గొన్నారు.

## ఆగివున్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

**చిల్లకూరు, మే 11, ప్రభాతవార్త**
మండలంలోని బోగనం టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం గుంటూరు నుండి నాయుడుపేట వైపు



టమోటా లోడ్డుతో వెళ్తున్న లారీ ఆగివున్న లారీని ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో సర్దార్ (45) లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

## మాంబట్టు పారిశ్రామికవాడ వద్ద కాంగ్రెస్ ఆందోళన

**తడ, మే 11 ప్రభాతవార్త**
తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన గురువారం ఆందోళన చేశారు. ఇటీవల పలుచోట్ల కార్మికుల జీతాలు పెంచాలంటూ మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేస్తున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, సామాన్యుడికి ధరలు అందుబాటులో లేని కారణంగా పరిశ్రమలు జీతాలు కూడా పెంచాలని కాంగ్రెస్ పార్టీ నేతలు నినాదాలిచ్చారు. తీగల భాస్కర్, శివకుమార్, పంటా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా తెలుగుగంగ నీరు

**-1200క్యూసెక్కుల నీరు విడుదల**
**-చెన్నైకు దాహార్తికి 350 క్యూసెక్కులు విడుదల**

తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త : కండలేరు పూండి కాలువలో గలగలా గంగమ్మ కదలి వస్తుండగా అధికారుల్లో ఉత్సహం చోటు చేసుకుంది. అధికారుల మొహంలో కళ వచ్చింది.గత నెల రోజులుగా ఇటు శ్రీకాళహస్తి, అటు తిరుపతి అధికారుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. శ్రీకాళహస్తికి మంచినీరు అందించే జ్ఞానప్రసూనాంబ సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులోనూ, తిరుపతి దాహార్తిని తీర్చే రామాపురం రిజర్వాయర్‌లోనూ నీరు తగ్గిపోవడంతో అధికారుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. భూగర్భ జలాలు అడుగింటటం, బోర్లు బావురు మనుతుండటంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలనే మీమాంశంలో ఉండగా గంగకాలువలో నీరు విడుదల చేయడంతో అధికారులు, అన్నదాతలు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నిండు కుండలా తెలుగుగంగ కాలువలో నీరు

**గంగ నీరు విడుదల :**
గత కొద్దిరోజుల క్రితం విడుదల ఆపివేసిన నీరు తిరిగి మళ్ళీ విడుదల చేయడంతో గంగ కాలువలో నిండుకుండలా ప్రవహిస్తోంది. తెలుగుగంగ పథకంలో అంతర్భాగమైన కండలేరు-పూండి కాలువలోకి అధికారులు కండలేరు నుంచి 2వేల క్యూసెక్కులుపైగా నీటిని విడుదల చేశారు. తొట్టంబేడు మండల పరీవాహన ప్రాంతాల్లో 1500 క్యూసెక్కుల వరకు నీరు విడుదల చేశారు. దీంతో గంగకాలువలో నిండుకుండలా నీరు ప్రవహిస్తోంది. కాలువలో దీనితో పాటు చెన్నై ప్రజలకు దాహార్తికి 350 క్యూసెక్కులనీటిని విడుదల చేశారు.

ఇక 7వ బ్రాంచి కెనాల్‌కు 400క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, ఇక తొట్టంబేడు మండలంలోని పరిశ్రమలకు, వరదయ్యపాళెంలోని శ్రీసిటీకి కూడా గంగనీటిని అందిస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని ఆయకట్టుకు కూడా నీటిని అందిస్తూ, రెండో పంట వేసేందుకు చెరువులకు నీటిని అందిస్తున్నారు. ఇక 8, 8ఎ, 9వ బ్రాంచి కెనాల్‌కు కూడా నీటిని విడుదల చేశారు. ఇక తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, రాపూరు ప్రాంతాలకు నీటిని అందిస్తున్నారు. ఇది కాకుండా భూగర్భజలాలను పెంచేందుకు నాయుడుపేటలో ఉన్న స్వర్ణముఖినదిలో చెక్‌డ్యాంలకు కూడా నీటిని అందిస్తున్నామని దీంతో అన్నదాతలు తాము వేసుకున్న బోర్లలో నీటిమట్టం పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్నదాతలకు సాగునీరు, ఆంధ్ర, చెన్నై ప్రజలకు సాగునీరు అందిస్తున్నారు.

## మమ్మల్ని దీవించవమ్మా! బండవేషంలో భక్తులు మొక్కులు



తిరుపతి,మే 11ప్రభాతవార్త: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతరలో రెండవరోజు గురువారం ఉదయం భక్తులు, చిన్నపిల్లలు అమ్మవారికి బండవేషం వేసి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నపెద్ద తేడాలేకుండా శరీరమంతా కుంకుమ రాసుకుని మొఖానికి,చేతులకు తెల్లనామం బొట్లుపెట్టుకుని చేతిలో వేపాకులతో బూతు మాటలు మాట్లాడుతూ గంగమ్మ ఆలయం చేరుకున్నారు. శుక్రవారం ఉదయం తోటివేషంలో భక్తులు గంగమ్మకు మొక్కులు తీర్చుకోనున్నారు.

## గంగమ్మ సారెలో అందరూ పాల్గొనాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, మే 11 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించే కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని, నగర పాలక సంస్థలోని అధికారులు, సిబ్బంది అందరూ సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొనాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. శుక్రవారం సారె సమర్పణ కార్యక్రమ ఏర్పాట్లపై తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో విభాగ అధిపతులతో గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశం జరిగింది. అధికారులకు కమిషనర్ హరిత సూచనలు చేస్తూ గంగమ్మకు భక్తి శ్రద్ధలతో సారె సమర్పించేలా అన్ని ఏర్పాట్లను పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. సారె సమర్పణలో పాల్గొనే కళాకారులకు, భక్తులకు త్రాగు నీరు, మజ్జిగ అందుబాటులో వుండేలా పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. కళాకారులకు రోడ్డుపై నడిచేపటప్పుడు కాళ్ళు కాలకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని పిచికారి చేయించాలన్నారు. సారె సమర్పణలో పాల్గొనే మన సిబ్బందిలో వేషాలు వేసుకొనే వారి కోసం గంధం, కుంకుమ, బొగ్గుపొడి, రిబ్బన్లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోలీసులు సహకారం తీసుకుని మన నగర పాలక సంస్థ సారె ఊరేగింపును చక్కగా ట్రాఫిక్కు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలన్నారు. సారె తీసుకెల్లే రిజర్వాయర్ రోడ్డు, ఓల్డ్ మెటర్నరిటీ రోడ్, భవాని నగర్ జంక్షన్, వివి మహల్ రోడ్, ఓల్డ్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్, తుడా సర్కిల్ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీరు వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రావు, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, సెక్రటరీ రాధిక, ఏసిపిలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, గోమతి, మెప్మా, కృష్ణవేణి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లీ మా సారె అందుకో!

**-జాతరలో సారెలతో గంగమ్మకు మొక్కులు**



తిరుపతి,మే 11ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మకు పలువురు ప్రముఖులు భక్తులుగా జాతరలో సారె సమర్పిస్తున్నారు. గంగమ్మకు ఎంతో ప్రీతిపాత్రమైన పసుపు,కుంకుమ, పూలు,పళ్ళు, రవికె, పట్టుచీరలతో సారెను భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించుకుంటున్నారు. గంగమ్మ జాతరలో భాగంగా రెండవరోజు గురువారం ఉదయం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి, శిష్యులు, రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కెఎన్ రాజు, సుబ్రమణ్యంయాదవ్ తదితరులతో కలసి స్థానిక తాళ్ళపాక పెద్దగంగమ్మ ఆలయం వద్ద నుంచి సారెను భక్తితో తలపై పెట్టుకుని డప్పులు, కళాకారుల వేషాలతో గంగమ్మ ఆలయం చేరుకుని అమ్మవారికి సారె అందజేశారు. అనంతరం ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఇఒ మునికృష్ణయ్య అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల వెంకన్న బ్రహ్మోత్సవాల తరహాలో గంగమ్మజాతరకు గురువారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత దంపతులు అమ్మవారికి సారెను సమర్పించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, ,ఉపమేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు భక్తితో అమ్మవారికి వేపాకులతో మొక్కులు తీర్చుకున్నారు.



## ఈ రహదారి దారుణం : అవస్థల్లో ప్రజలు



కోట, మే 11 ప్రభాతవార్త : పల్లె సీమలంటే పచ్చని చెట్లు, చల్లని గాలులు, సంధ్య వేళ అక్కడికి వెళ్లాలంటే నల్లని తాచుపాములాంటి రహదారులు.. అవన్నీ ఒకప్పటి మాటలు. మరి ఇప్పుడు పల్లెకు వెళ్లే రోడ్లపై అడుగడుగునా గుంతలు, వాటిపై వెళితే విరిగే నడుములు, పట్టపగలు వెళ్లాలంటేనే చుక్కలు కనిపించే పరిస్థితులు. అసలు రోడ్డా అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కోట మండలం గూడలి పంచాయతీ రాజుపాలెంకు వెళ్లే పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. రోడ్డుపై కంకర లేచి ఎటు చూసినా అడుగుకో గుంట పడి రాళ్లు తేలి అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ రహదారిపై వెళ్లాలంటే ప్రమాదకరం. ఏ కాస్త ఆదమరిచినా కాళ్లు చేతులు విరుగుతాయని ఆ గ్రామ ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఈ రోడ్డుపై తారు వేయాలని గూడలి, రాజుపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉత్సవమూర్తులను దిగువ కనికాపురంలో ఊరేగింపు



వెదురుకుప్పం, మే 11 ప్రభాతవార్త : జక్కదొన మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం దిగువ కనికాపురం గ్రామంలో ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగించారు. సాంప్రదాయం ప్రకారం మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముందు మహాభారతం పరిధిలోని గ్రామాలలో ఊరేగించడం పరిపాటి. ఈ క్రమంలో గంటా వారిపల్లె పంచాయితీ పరిధిలోని దిగువ కనికాపురం గ్రామంలో ఇంటింటికి ద్రౌపదమ్మ, పంచపాండ, శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తులను దప్పుల దరువుల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని కానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహాభారత ఆలయ ధర్మకర్త మాధవ నాయుడు, దిగువ కనికాపురం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ మహాయజ్ఞంకు కాణిపాకం ప్రచారరథం



కాణిపాకం, మే 11 ప్రభాతవార్త: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుండి 17 వరకు ఆరురోజుల పాటు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ప్రచార రథంను ప్రదర్శన నిమిత్తం వుంచనున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, ప్రజలందరూ శాంతి, సుఖ సంతోషాలతో వుండాలని కోరుతూ ఈనెల 12 నుండి 17 వరకు ఆరు రోజుల పాటు ఈయజ్ఞంను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు ఆరు రోజుల పాటు వుంచి పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఉదయం ఆలయ వద్ద నుండి ప్రచారరథం విజయవాడకు బయలుదేరి వెళ్ళింది. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి పట్టిన శని వైకాపా : మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి



పెద్దపంజాణి మే 11 ప్రభాతవార్త : రాష్ట్రానికి వైకాపా శనిపట్టిందని ఈ శని,ఖర్మ ఎప్పుడు వదులుతుందా అని రాష్ట్రప్రజానీకం ఎదురుచూస్తోందని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి విమర్శించారు, గురువారం చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం రాయలపేట కూడలిలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలు,కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటిపన్ను, మరుగుదొడ్లకు, పట్టణాలలో ఖాలీజాగాలకు,చెత్తకు పన్నులు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని, మళ్లీ జగన్మోహన్ రెడ్డికి ఓటేస్తే గాలికికూడా పన్ను వేస్తారని ఎద్దేవా చేసారు.గడచిన నాలుగేళ్లలో విద్యుత్ చార్జీలు ఎనిమిదిసార్లు పెంచి రైతుల నెత్తిన భారం మోపారన్నారు.నిత్యావసర సరుకుల ధరలు,ఆర్టీసీ చార్జీలు,పెట్రోల్ డీజల్ ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేసారు.పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఏపిలో పెట్రోల్ ధర 14 రూపాయలు అధికంగా ఉందన్నారు.అధికారంలోకి రాగానే మద్యనిషేధం చేస్తానన్న సీఎం జగన్‌రెడ్డి క్వార్టరు మందును రూ.200 ధర పెంచి ప్రెసిడెంట్ మెడల్,స్పెషల్ స్టేటస్ వంటి తెలియని బ్రాండలను మద్యం షాపుల్లో విక్రయిస్తూ మహిళల మెడలో పుస్తెలు తాకట్టు పెట్టుకునేలా చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల పెట్టుబడి దారులను బెదిరించి తరిమేస్తున్నారన్నారు.సుమారు 30వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అమర్‌రాజా 9వేల500కోట్ల పెట్టుబడి పెట్టే పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తరిమేసారని పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చిన వారంలో ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ ఇస్తామన్న సిఎం ఉద్యోగులకు నెలనెలా ఒకటోతారీఖున జీతాలు ఇచ్చే పరిస్థితి ఉందా జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు.నాలుగేళ్ళ పాలనలో రాష్ట్రానికి ప్రజలకు ఏమిచేసారో వైకాపా నేతలు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అనంతరం తేదేపా నాయకులు,కార్యకర్తలతో కలసి స్థానిక దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు,అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా కార్యకర్తలు,అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## 14నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

**-16న సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం**



తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలోని ఆకాశగంగ సమీపంలోని "అంజనాద్రి"లో ఈనెల 14నుంచి 18వతేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను టిటిడి నిర్వహిస్తోంది. ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమజ్జయంతి ఉత్సవాలు, 16వతేదీ సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం నిర్వహణపై గురువారం జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, న్యాయాధికారి జస్టిస్ వీరాజు, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్‌తో కలసి సమీక్షించారు. హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా 16వతేదీ మంగళవారం దాదాపు 16గంటల పాటు 67మంది ప్రముఖ పండితులతో తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం జరిపించేందుకు చక్కటి ఏర్పాట్లు చేయాలన్నారు.

## టిడిపి తిరుపతి పార్లమెంట్ కార్యదర్శిగా యశ్వంత్‌రెడ్డి



తిరుపతి,మే 11 ప్రభాతవార్త: టిడిపి తిరుపతి పార్లమెంట్ కార్యదర్శిగా తిరుపతి నియోజకవర్గానికి చెందిన అమ్మగుంట యశ్వంత్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికలనాటికి పార్టీని బలోపేతం చేసేదిశగా పనిచేస్తానని అన్నారు.

## రీ సర్వేలో హద్దురాళ్ళు నాటే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**-జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ**



తిరుపతిరూరల్, మే11 ప్రభాతవార్త: మొదటి ఫేజ్ రీ సర్వే గ్రామాల్లో హద్దురాళ్ళు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిసిఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సర్వే రాళ్ళు నాటే ప్రక్రియ, భూ హక్కు పత్రాల పంపిణి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లుతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాలలో మొదటి దశలో భాగంగా రీ సర్వే పూర్తైయైన గ్రామాలలో సర్వే రాళ్ళు నాటే ప్రక్రియ, వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పత్రాల పంపిణి కార్యక్రమానికి సంబంధించిన పనులు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫెరెన్స్ అనంతరం జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో రీ సర్వే పూర్తయైన గ్రామాలలో సర్వే రాళ్ళు నాటడం, ఖాతాలకు ఫోటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సర్వే రాళ్ళు నాటే ప్రక్రియలో సంబంధిత అధికారులు ప్రతిరోజు సమీక్షించి, లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

## శివయ్యకు వెండి బిందె,శంఖం బహూకరణ



శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరునికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఆలయ ఛైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన తరువాత భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపధ్యంలో గురువారం శ్రీకాళహస్తి పట్టణం సన్నిధివీధికి చెందిన తీగల కోటేశ్వరరావు కుమారుడు తీగల హేమంత్ కుమార్ ఓవెండి బిందె, ఓ శంఖాన్ని బహూకరించారు. సుమారు రూ.1.78లక్షల విలువ కల్గిన ఉరువులను ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేసారు. వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనం,అంతరాలయ దర్శనం ను ఛైర్మెన్ ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనం తరువాత వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీ ర్వచనాలు అందించారు.హేమంత్‌తో పాటు తీగల భాను,వవేలూరు రమేష్, పసుపులేటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## సంక్షేమ క్యాలెండర్ భేష్ : మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు, మే 11 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ భేష్‌గా వుందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా ముద్రించి జిల్లాకు పంపిణీ చేసిన ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమం పథకాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తోందన్నారు. క్షేత్ర స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే మరింత వేగవంతం

**- సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్**

చిత్తూరు, మే 11 ప్రభాతవార్త: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుండి గురువారం భూముల రీ-సర్వే కార్యక్రమాలకు సంబంధించి భూహక్కు పత్రాలు, భూరక్ష స్టోన్స్, గ్రౌండ్‌టు థింకింగ్ ప్రక్రియ తదితరాలపై సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీకి కలెక్టర్ సగిలి షన్మోహన్ సమాధానం ఇస్తూ జిల్లాలో మొదటి విడతలో 134 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి అయ్యిందని ప్రస్తుతం ఇక్కడ 1.26 లక్షల స్టోన్ ప్లాంటేషన్ చేపట్టి పూర్తి చేశామన్నారు. అలాగే మరో 12 వేల స్టోన్స్ నాటే ప్రక్రియ జరుగుతుందన్నారు. మరో 15 రోజుల్లో ఈ కార్యక్రమంను పూర్తి చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి కనకప్రసాద్, రీ-సర్వే డిప్యుటీ తహసిల్దారు పర్వీన్, పిఎల్ఆర్ డిటి శివ, సర్వేయర్ గణేష్‌లు పాల్గొన్నారు.

## విడతల వారీగా మామిడి కోతలు

**- జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి**



చిత్తూరు, మే 11 ప్రభాతవార్త: రైతులు పక్వానికి వచ్చిన మామిడి మాత్రమే కోతలు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు మ్యాంగో భవన్‌లో గురువారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యానశాఖ సిబ్బంది, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల సమన్వయంతో మామిడి కాయలు కోసే సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మామిడి ప్రధాన పంట అని, ఇందులో తోతాపురి రకం మామిడి సాగు 42,204 హెక్టార్లలో వుందన్నారు. అలాగే జిల్లాలో 39 మామిడి గుజ్జు పరిశ్రమలు వుండగా ఇందులో 30 పరిశ్రమలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తున్నాయన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు ఇప్పటికే తోతాపురి రకం కేజీ మామిడి 19 రూపాయల మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. మామిడి రైతుల్లో అవగాహన పెంచి మామిడి తోటల్లో వున్న మామిడి పంటను ఒకేసారి కోయకుండా విడతల వారీగా కోసి ఫ్యాక్టరీలకు పంపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది రెండున్నర నెలల పాటు క్షేత్ర స్థాయిలో రైతులకు కోత, యాజమాన్య పద్దతులపై పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ర్యాంపుల వద్ద రైతులకు ఎలాంటి నష్టాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకొన్నారన్నారు. రైతులకు తూకంలో ఎక్కడైనా అనుమానం వస్తే సత్వరం అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు, ఫ్యాక్టరీ యాజమానులకు నష్టం వాటిల్లకుండా నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నాగవేణి, రాఘవేంద్ర, మార్కెటింగ్ ఎడి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల, పిల్లలపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తలు అవాస్తవం!

**వ్యక్తిగత కారణాలతో గొడవ : ఇరుపక్షాలపై కేసు నమోదు**

తిరుపతి క్రైం, మే 11 ప్రభాతవార్త : తాతయ్యగుంట గంగమ్మ గుడికి దర్శనార్ధం వచ్చిన మహిళల, పిల్లలపై దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయస్వాములు తెలిపారు. వివరాలి ఇలా ఉన్నాయి. వేదాంతపురం అగ్రహారంకు చెందిన సోము అను వ్యక్తి ఇన్స్టాగ్రామ్‌లో ఉప్పరపల్లికి చెందిన మహమ్మద్ బాషకు ఆన్‌లైన్‌లో అమ్మాయి పేరుతో రెండు రోజుల ముందు మెసేజ్ చేయగా అందుకు మహమద్ భాష కూడా స్పందిస్తూ ఉన్నాడు. తరువాత సోము అమ్మాయి పేరుతో ఇన్స్టాగ్రామ్‌లో మెసేజ్‌లు పెడుతున్నట్లు తెలుసుకుని మహమద్ ఫోన్ చేసి సోమును దూషించాడు. ఇలా వారి మధ్య మాట మాట పెరిగి, సోము తన ఫ్రెండ్ నవీన్‌కు విషయం చెప్పగా నవీన్, మహమ్మద్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. తదుపరి మహమ్మద్ తన ఫ్రెండ్ పసుపులేటి చందుకు విషయం చెప్పాడు. చందు ఫోన్‌లో నవీన్‌తో గొడవ పెట్టుకుని నువ్వు ఎక్కడ ఉన్నావు. నేను అక్కడకే వచ్చి మీ కథ తేల్చేస్తానని హెచ్చరించాడు. చందు తుడ సర్కిల్ వద్ద అరటికాయల మండిలో ఉంటానని వచ్చి తేల్చుకో అని చెప్పగా 10వ తేది రాత్రి సుమారు 10.30 గంటలకు సోము, నవీన్, అతని స్నేహితులు శశాంక్, భరత్, పవన్ కళ్యాణ్, ప్రకాష్, డిల్లీ, మౌళి, చోటు, రోహిత్‌లు కట్టెలు తీసుకుని ఆటోలో తుడ సర్కిల్ వద్దకు వచ్చారు. అప్పటికే మహమద్, చందు అతని అన్న నాగార్జున వారి స్నేహితులు గంగాధర్, ప్రదీప్ కుమార్ అలియాస్ పతిలు కర్రలతో సిద్ధముగా వుండి ఒకరికొకరు గొడవ పడారు. తరువాత శశాంక్, భరత్‌లు పికె లేఔట్‌లో ఉంటున్న వాళ్ల అమ్మ ఉషారాణికి ఫోన్ చేసి విషయం తెలుపగా ఆమె తన కుమార్తె చందన ప్రియతో కలిసి తుడా సర్కిల్ వద్దకు వచ్చి సోము, నవీన్ శశాంక్, భరత్, పవన్ కళ్యాణ్, ప్రకాష్, డిల్లీ, మౌళి, చోటు, రోహిత్‌లతో కలిసి చందు వాళ్ళతో తిరిగి గొడవ పడ్డారు. ఈ గొడవలో ఇరు పార్టీలకు గాయాలైయ్యాయి. సదరు విషయంగా ఇరు పార్టీల ఫిర్యాదులపై తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేసారు. ఈ కేసులో ఫిర్యాదిగా ఉన్న ఉషారాణి తాను తన పిల్లలతో గంగమ్మ గుడి దర్శనానికి ఆటోఓ వచ్చినప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు తమపై దాడి చేసినట్లు సోషియల్ మీడియాలో చెప్పటమైంది. అయితే పోలీసు విచారణలో సోము ఆన్‌లైన్‌లో అమ్మాయి పేరుతో మహమ్మద్‌కు ఇన్స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టగా సదురు మెసేజ్‌కు మహమ్మద్ కూడా రిప్లై ఇస్తూ ఉండి, తదుపరి అమ్మాయి పేరుతో సోము రిప్లై ఇస్తున్నట్లు మహమ్మద్ తెలుసుకుని ఇరుపక్షాల వారు గొడవపడ్డారు. ఉషారాణి తాను తన పిల్లలతో గంగమ్మ గుడికి దర్శనానికి ఆటోలో వచ్చినట్లు అందరిని నమ్మించి తప్పుదోవ పట్టించింది. ఆమె చెప్పిన విషయాన్ని నిజనిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం చేసారు. ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేసి ప్రజలను భయాందోళనకు గురి చేయడం ఎంత వరకు సబబు కాదు ఇలాంటి వార్తలను ప్రచురించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.